క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఏడుగురు విద్యార్థులు


జ్యోత్స్న


కె.రాజేష్


బి.తేజ


ఐ.రుహాన్సీ


ఎస్.మనోజ్


ఓ.అక్షయ


ఎం.అశ్విని

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు జ్యోత్స్న, కె. రాజేష్, బి. తేజ, వై.రుహాన్సీ, ఎస్. మనోజ్, ఓ.అక్షయ, ఎం. అశ్విన్ పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారని హెచ్ఎం టీవీజేకే మూర్తి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను అభినందించారు.

చెత్త సేకరణపై ఆరా..!

గజపతినగరం: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్తను.. ఇళ్ల నుంచి సేకరిస్తున్న తడి, పొడి చెత్తపై పంచాయతీ గ్రామీణాభివృద్ధి విస్తరణాధికారి సుగుణాకరరావు తెలిపారు. మండలంలోని దావాలపేట, ఎం.వెంకటాపురం గ్రామాల్లో చెత్త సేకరించే విధానాన్ని బుధవారం ఆయన పరిశీలించారు.

ఉపకరణాల పంపిణీ


దివ్యాంగ పిల్లలకు ఉపకరణాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ విమలమ్మ

గజపతినగరం: మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ చిన్నారులకు బుధవారం ఉపకరణాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ విమలమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండలానికి చెందిన 19 మంది పిల్లలను ఉపకరణాలకు అర్హులుగా గుర్తించినట్లు చెప్పారు. వారికి ట్రై సైకిళ్లు, వీల్‌చైర్లు, వినికిడి యంత్రాలు అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు శ్రీనివాసరావు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ


రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు

గుర్ల: రైతులందరికీ వరి విత్తనాలు అందించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పొట్నూరు సన్యాసినాయుడు అన్నారు. మండలంలోని పాలవలసలో రైతులకు వరి విత్తనాలు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్క రైతుకూ విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ వల్లూరి రాము, మీఏఏ సంగమేష్, స్థానిక నేతలు గేదెల అప్పలనాయుడు, పెనుమజ్జి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం విజయవంతం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): గరివిడి మండలంలోని అర్థమూరు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభించింది. శ్రీకాకుళం జిల్లాలోని జెమ్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో అర్థమూరు, పరిసర గ్రామాలకు చెందిన రోగులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వైద్యసిబ్బంది రోగులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో విజయగౌరి యువజన సేవాసంఘ అధ్యక్షుడు పిల్లా సుధాకర్, మాజీ సర్పంచ్ మహంతి రమణమూర్తి, నీటి సంఘం చైర్మన్ గంగుపల్లి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన


ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సచివాలయాల ఉద్యోగులు

శృంగవరపుకోట: 'పనికైతే మా వాళ్లు ప్రమోషన్ అడిగితే పరాయివాళ్లు.. ప్రమోషన్ ఫస్ట్ – ట్రాన్స్‌ఫర్ నెక్స్ట్.. సొంత మండలాల్లో బదిలీలకు అవకాశం ఇవ్వాలి' అన్న ప్లకార్డులతో సచివాలయ ఉద్యోగులు బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తంచేశారు. అనంతరం ఎంపీడీఓ సతీష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ.. ఆరేళ్ల సరీస్ పూర్తి చేసిన వాళ్లకి ప్రమోషన్ ఇచ్చి ట్రాన్స్‌ఫర్ చేయాలన్నారు. ప్రొబేషన్ డిక్లరేషన్‌లో ఆలస్యం అయిన తొమ్మిది నెలలకు ఎరియర్స్ మంజూరు చేయాలని కోరారు. అలాగే రెండేళ్ల ప్రొబేషన్ టైమ్‌కి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలన్నారు. జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రభుత్వం నడుస్తోందా....?

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ ఇందుకూరి ఫైర్
- దేవదాయశాఖ భూములపై రగడ



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రఘురాజ్, ఎంపీపీ సోమేశ్వరరావు, వైస్ ఎంపీపీ సుధారాజు, ఎంపీడీఓ సతీష్, తదితరులు

శృంగవరపుకోట: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందా.. లేక కార్పొరేట్ కంపెనీ నడుస్తుందో తెలియడం లేదు.. ఈ మాటలు అన్నది సాక్షాత్తూ ఒక ఎమ్మెల్సీ. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్సీ రఘురాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్నెళ్లలో ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టలేదని గిరిజనుల భూములు లాక్కుంటున్నారు.. 18 ఏళ్లుగా కంపెనీ పెట్టని జిందాల్ భూముల్ని ఎందుకు తీసుకోరని ప్రశ్నించారు. బందవలసలో 60 మంది గిరిజనులకు పట్టాలిచ్చిన 4.5 ఎకరాల గ్రామకంఠం.. 23 ఎకరాల ఉద్యానశాఖ భూముల్ని జిందాల్ కంపెనీ ఎలా లాక్కుందన్నారు. గెయిల్ లాంటి కంపెనీలకు ఇచ్చిన భూములు లాక్కున్న సర్కారు జిందాల్ విషయంలో ఎందుకు తాత్సారం వహిస్తుందో అర్థం కావడం లేదన్నారు. ముప్పై ఏళ్లు పెంచుకున్న తోటల్ని జిందాల్ కంపెనీ ప్రతినిధులు ధ్వంసం చేస్తుంటే అధికారులు ఒత్తాసు పలుకుతున్నారని మండిపడ్డారు. ఇదేనా ప్రజాస్వామ్యమని ప్రశ్నించారు. ఎంఈఓ బీజీ లక్ష్మి మాట్లాడుతూ.. 71మంది విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత సీట్లు పొందారని, 3405 మందికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కొట్టాం పీహెచ్‌సీ వైద్యురాలు హారిక మాట్లాడుతూ.. సికెల్‌సెల్ ఎనిమియా బాధితులకు రూ.10 వేల ఫించన్ ఇస్తారని చెప్పారు. వ్యవసాయాధికారి రవీంద్ర మాట్లాడుతూ.. ఈకేవైసీ చేయించుకున్న 9000 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకంలో రూ.4 వేలు, పీఎం.కిసాన్ సమ్మాన్ యోజనలో రూ.2 వేలు రైతుల ఖాతాలకు జమ చేస్తారన్నారు. సీడీపీఓ అచ్యుత మాట్లాడుతూ.. ప్రీ స్కూల్ ఎన్‌రోల్‌మెంట్‌లో, బాల్యవివాహాల నిర్మూలనలో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సత్యకిశోర్ మాట్లాడుతూ.. రెండు నెలల్లో జల్‌జీవన్ మిషన్ పనులు పూర్తి చేసి తాగునీరు అందిస్తామని చెప్పారు. పుణ్యగిరి దేవస్థానం ఈఓ నాగేంద్ర గైర్హాజరుపై ఎంపీపీ సోమేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని ఎంపీడీఓను ఆదేశించారు. కొట్టాం ఈఓ దేవదాయశాఖ భూముల వివరాల ప్రతిని ఎమ్మెల్సీ రఘురాజ్‌కు ఇవ్వగా.. 992 ఎకరాల భూములు ఆక్రమణలు, కబ్జాల్లో ఉన్నట్లు చూపటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీఓ సతీష్, ఎంపీటీసీ సభ్యుడు వాకాడ సింహాచలం, వైస్ ఎంపీపీ సుధారాజు, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దిశానిర్దేశం..


సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు బొత్స అప్పలనరసయ్య, కడుబండి శ్రీనివాసరావు, అలజంగి జోగారావు, పీడిక రాజన్నదొర, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, రాజాం ఇన్‌చార్జ్ తలే రాజేష్

వైఎస్సార్‌సీపీ మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ముఖ్య నాయకులతో పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి తాడేపల్లిలో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రజా సమస్యలపై చేయాల్సిన పోరాటాలపై మాజీ ముఖ్యమంత్రి నాయకులకు దిశానిర్దేశం చేశారు. కూటమి పాలనలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని.. వారి సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి, ప్రజలకు అండగా నిలవాలని సూచించారు.

ఇలాంటి వాతావరణంలో వంటలా..?


అపరిశుభ్ర వాతావరణం నడుమ రేకుల షెడ్‌లో వంటలు చేస్తున్న నిర్వాహకులు

కొత్తవలస మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అపశుభ్ర వాతావరణంలో మధ్యాహ్న భోజనం వంటలు చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పాఠశాల ఆవరణ అస్తవ్యస్తంగా మారింది. చిన్న రేకుల షెడ్డులో వంటలు చేయడం.. చుట్టూ ఈగలు ముసురుకోవడం.. చిన్న పాటి వర్షానికీ షెడ్డు కారిపోతుండడంతో నిర్వాహకులు తడుచుకుంటూనే వంటలు చేయాల్సివస్తోంది. అపరిశుభ్ర వాతావరణంలో వండుతున్న ఆహారం తింటే ఎటువంటి రోగాలు ప్రబలుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అలాగే పాఠశాల ఆవరణలో గల బోరు చుట్టుకూడా పెద్ద ఎత్తున గడ్డి పేరుకుపోయింది. బోరు చుట్టూ ప్లాట్‌ఫారం లేకపోవడంతో బురదలో దిగి మరీ ప్లేట్లు, కాళ్లు, చేతులు కడుక్కోవాల్సి వస్తోంది. ఈ విషయమై ప్రధానోపాధ్యాయురాలు సునీత వద్ద ప్రస్తావించగా..వంటగది చిన్నది కావడంతో పక్కనే గల చిన్న రేకుల షెడ్‌లోనే వంటలను నిర్వహిస్తున్నారని బదులిచ్చారు. – కొత్తవలస

రసాయన ఎరువుల వినియోగం తగ్గించండి

- వ్యవసాయశాఖ ఏడీఏ మహరాజన్


మాట్లాడుతున్న ఏడీఏ మహరాజన్

గజపతినగరం: జీలుగ, కట్టి జనుము, పిల్లి పెసర, తదితర పచ్చిరొట్ట ఎరువులు వినియోంచి, రసాయన ఎరువులను తగ్గించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె. మహరాజన్ అన్నారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూసారి పెరిగి అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. మండలంలోని గంగచోళ్లపెంటలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పచ్చిరొట్ట విత్తనాలు వేసిన తర్వాత ఉభాల సమయంలో బాగా కలియదున్నాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమిలో సేంద్రియ కర్బన శాతం పెరుగుతుందని చెప్పారు. అలాగే సుడోమోనాస్ పౌడర్‌తో విత్తనశుద్ధి చేయడం వల్ల అగ్గి తెగులు, పొడ తెగులు, పొట్ట కుళ్లు తెగుళ్లు రావని తెలిపారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా పత్తి పంటకు బీమా చేయించుకోవడానికి జూలై 15వ తేదీ వరకు ప్రభుత్వం గడువు ఇచ్చిందని.. రైతులు ఈ లోగా ఎకరానికి 1923 రూపాయల ప్రీమియం చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖాధికారి పి.కిరణ్‌కుమార్, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం రేపు

గజపతినగరం రూరల్: మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో నేపథ్యంలో శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఏ శివకుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గజపతినగరం, పురిటిపెంట, ఎం.వెంకటాపురం, రైల్వేస్టేషన్‌రోడ్డు, మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడిపేట, ఎం.గుమడాం, పీఎస్ఆర్ పురం, కేఎస్ఆర్ పురం, డోలపాలెం, సీతారామపురం, ముద్దూరు, పిడిశీల, గంగచోళ్లపెంట, పాతబగ్గాం, కొణిశ, సాలిపేట, మెంటాడ, పట్రువాడ, బూడిపేట, దావాలపేట, భూదేవిపేట ఓలం ఫ్యాక్టరీతో పాటు పలు గ్రామాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపాధ్యాయులను నియమించాలి

దత్తిరాజేరు: మండల వ్యాప్తంగా 35 గ్రామ పంచాయతీలలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని మానవ హక్కుల సంఘం జిల్లా కార్యదర్శి మిత్తిరెడ్డి ఈశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ..విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటే విద్యార్థులకు మంచి బోధన అందుతుందన్నారు.

నేడు రక్తదాన శిబిరం

చీపురుపల్లి: భారతీయ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ), ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో గురువారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ డివిజన్ కో ఆర్డినేటర్ బీవీ గోవిందరాజులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్‌బీఐ ఏర్పాటై 70 సంవత్సరాలు పూర్తయిన నేపథ్యంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు స్థానిక స్టేట్‌బ్యాంక్ బ్రాంచ్ ఆవరణలో రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని తెలిపారు. దాతలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

మాదకద్రవ్యాలతో జీవితం నాశనం

చీపురుపల్లి రూరల్ (గరివిడి): మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం నాశనమవుతుందని మండల విద్యాశాఖాధికారి పి. రామారావు అన్నారు. గరివిడి మండలంలో గల కొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవగాహన లోపం కారణంగా ఎంతోమంది పిల్లలు మాదకద్రవ్యాలకు అలవాటు పడుతున్నారన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి చక్కగా చదువుకోవాలని సూచించారు. అనంతరం మాదకద్రవ్య రహిత సమాజం కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం.డి.రాము, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫోన్‌లు తీసుకెళ్తే చర్యలు

- డీఈఓ మాణిక్యాలరావు


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ మాణిక్యాలనాయుడు

కొత్తవలస: తరగతి గదుల్లోకి సెల్‌ఫోన్‌లు తీసుకెళ్తే సంబంధిత ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని జిల్లా విద్యాశాఖాధికారి యు.మాణిక్యాలనాయుడు హెచ్చరించారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కొత్తవలస, లక్కవరపుకోట మండలాల ఎంఈఓలు బండారు శ్రీనివాసరావు, కూర్మారావు, శ్రీనివాసరావు, పాఠశాల హెచ్ఎం ఈశ్వరరావు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం


చీపురుపల్లి: బదిలీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న అనంతం, ఉపాధ్యాయులు


చీపురుపల్లి రూరల్: ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు

చీపురుపల్లి: ఉపాధ్యాయుల సేవలు సమాజానికి ఎంతో అవసరమని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇప్పిలి అనంతం అన్నారు. మండలంలోని రామలింగాపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులు ఎం.రఘురామయ్య, ఎస్.విజయలక్ష్మి, వి.మురళీకృష్ణలను పాఠశాల హెచ్ఎం గొర్లె పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సత్కరించారు. వీరితో పాటు పాఠశాలకు బదిలీపై వచ్చిన రాధాకుమారి, ఇటీవల ఉత్తమ సీఆర్‌పీగా ఎంపికైన కంది రామకృష్ణలను కూడా సన్మానించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ బెల్లాన రమణ, పాఠశాల కమిటీ చైర్మన్ ఇప్పిలి ఉమ, తదితరులు పాల్గొన్నారు.

గెద్దపువలసలో..

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని గెద్దపువలస ప్రాథమికోన్నత పాఠశాల నుంచి వేరే ప్రాంతానికి బదిలీ జరిగిన త్రినాథ్, రమణ, చక్ర అనే ఉపాధ్యాయులను సహచర ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు సరిచేశారు

సాక్షి ఎఫెక్ట్

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేట గ్రామంలో కిందకు వేలాడుతున్న విద్యుత్ తీగలను ట్రాన్స్‌కో సిబ్బంది సరిచేశారు. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండడంతో సాక్షి దినపత్రికలో ఈ నెల 24న 'చేతికందేంత ఎత్తులో విద్యుత్ తీగలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఎంపీడీఓ గొర్లె భాస్కరరావు ట్రాన్స్‌కో సిబ్బందిని అప్రమత్తం చేసి తీగలను సరిచేయించారు. సమస్య పరిష్కారం కావడంతో పెదమంత్రిపేట గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పెదమంత్రిపేటలో విద్యుత్ తీగలు సరిచేస్తున్న విద్యుత్ శాఖ సిబ్బంది



ఈనెల 24న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనం

రైతులందరికీ రాయితీపై విత్తనాలు


రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

కొత్తవలస: ప్రతి రైతుకీ రాయితీ వరి విత్తనాలు అందజేయాలని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మండలంలోని దెందేరు రైతుసేవా కేంద్రంలో వరి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. త్వరలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తామని తెలిపారు. రైతులకు పంట రుణాలు అందజేయడంలో బ్యాంకర్లు అలసత్వం వహిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో కొత్తవలస సర్పంచ్ విరోతి వెంకటరమణ, ఏఓ కర్రి రామ్‌ప్రసాద్, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్వేయర్ల సమ్మె..


సామూహిక సెలవు దరఖాస్తును తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందజేస్తున్న సర్వేయర్లు


గంట్యాడ: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న విలేజ్ సర్వేయర్లు

లక్కవరపుకోట: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు గురువారం నుంచి సామూహిక సెలవులు పెట్టి సమ్మెకు దిగారు. ఈ మేరకు మండలంలోని 23 మంది సర్వేయర్లు తహసీల్దార్ శ్రీనివాసరావును బుధవారం కలిసి సెలవు దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు సర్వేయర్లు మాట్లాడుతూ.. ప్రస్తుతం సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సర్వేయర్లలో ఆరు సంవత్సరాల సర్వీస్ ఉన్నవారికి మాత్రమే బదిలీ చేస్తామని తెలిపారన్నారు. కాగా రేషనలైజేషన్ వల్ల చాలా మంది సర్వేయర్లకు పోస్టింగ్‌లు ఇవ్వలేదన్నారు. ఈ విధంగా రాష్ట్రంలో సుమారు నాలుగు వేల మంది మిగిలిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముందుగా వారందరికీ పోస్టింగ్‌లు కల్పించి , ఆ తర్వాత బదిలీలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే సర్వేయర్ల సామూహిక సెలవు దరఖాస్తును ఉన్నతాధికారులకు పంపించి, తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు.

సమగ్ర నివేదిక సమర్పించాలి

గంట్యాడ: హేతుబద్ధీకరణలో భాగంగా మిగులు సిబ్బంది అయిన 4,722 మంది విలేజ్ సర్వేయర్ల భవిష్యత్‌పై సమగ్ర నివేదిక సమర్పించాలని గ్రామ సర్వేయర్ల సంఘ అధ్యక్షులు కె. శివ డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేడ్ 3 సర్వేయర్లను గ్రేడ్ 2కి మార్చినందున పే స్కేల్‌లో తగిన మార్పులు చేయాలన్నారు. రీసర్వేలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి సింగంపల్లి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకుంటాం..


సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

గుర్ల: పశువుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులను అక్రమంగా రవాణా చేసినా, కబేళాలకు తరలిస్తున్న వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలని వీఆర్‌ఓలను ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ శేషుబాబు, డీటీ నారాయణమ్మ, జంతు సంక్షేమ కమిటీ అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించండి..


పోలీస్‌స్టేషన్ ముందు బాధితులతో కలిసి ఆందోళన చేస్తున్న రేగ గ్రామస్తులు

లక్కవరపుకోట: మండలంలోని రేగ గ్రామంలో సర్వే నంబర్ – 23లో నెలకొన్న భూ సమస్యను పరిష్కరించాలని పలువురు గ్రామస్తులు కోరారు. వివరాల్లోకి వెళితే... సర్వే నంబర్ 23లో రాళ్లగుట్ట పేరిట ఉన్న ప్రభుత్వ పోరంబోకు భూమిలో అదే గ్రామానికి చెందిన పెనగంటి దేముడమ్మ, అచ్చియమ్మలు కొద్ది సంవత్సరాల కిందటి నుంచి పశువుల పాకలు వేసుకుని పశువులను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఆ భూమికి చెందిన స్థలం కలిగిన డెంకాడ శ్రీరాములు అనే వ్యక్తి పోరంబోకు స్థలాన్ని ఆక్రమించుకునేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాడు. ఈ వ్యవహారమై బాధిత వ్యక్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే తనకు అడ్డుగా వస్తే అట్రాసిటీ కేసు పెడతానని శ్రీరాములు బెదిరిస్తున్నాడు. దీంతో బాధితులు దేముడమ్మ, అచ్చియ్యమ్మలతో కలిసి గ్రామానికి చెందిన 40 మంది బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావుకు, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై నవీన్‌పడాల్‌కు వినతిపత్రాలు ఇచ్చి సమస్య వివరించారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ ఇరువర్గాల వారికీ నోటీసులు జారీ చేసి వచ్చే మంగళవారం జాయింట్ సర్వే నిర్వహించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

సంక్షిప్తంగా..

పథకాలు శతశతం అమలవ్వాలి

- ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి


సభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ రమణమూర్తి

గంట్యాడ: కేంద్ర ప్రభుత్వ పథకాలు శతశాతం అమలయ్యే విధంగా చూడాలని ఎంపీడీఓ ఆర్‌వీ రమణమూర్తి అన్నారు. మండలంలోని డీకే పర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ..ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ శ్యామ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నానిబాబు, విద్యుత్‌శాఖ ఏఈ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ ఎన్నిక ఏకగ్రీవం

చీపురుపల్లి: విశ్వబ్రాహ్మణ మండల సంఘ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగినట్లు ఆ సంఘ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలోని హడ్కోకాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడిగా మారోజు చక్రధర్, ఉపాధ్యక్షుడిగా సర్వసిద్ధి భాస్కరరావు, కార్యదర్శిగా పట్నాల ఈశ్వరరావు, సహ కార్యదర్శిగా బంగారు గోపి, కోశాధికారిగా అనుపోజు రాము, గౌరవ అధ్యక్షుడిగా అనుపోజు వెంకటనాయుడు, ముఖ్య సలహాదారునిగా బోనుమద్ది వీరాచారిని ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో తొమ్మిది మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకుందాం..

వేపాడ: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓపీఆర్‌డీ రవికుమార్ అన్నారు. వల్లంపూడిలో బుధవారం పర్యటించి పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

87 మందికి వైద్యసేవలు

వేపాడ: మండలంలోని జగ్గయ్యపేటలో 104 వైద్య సిబ్బంది బుధవారం వైద్య శిబిరం నిర్వహించి 87 మందికి వైద్యసేవలు అందించారు. దీర్ఘకాలిక రోగులు, సాధారణ రోగులను వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. వేణు పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఆంజనేయులు, శింగరాయి వెల్‌నెస్ సెంటర్ డీఓ మోహన్, ఏఎన్ఎం వెంకటలక్ష్మి, సతీష్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

వేపాడ: వెనుకబడిన విద్యార్థుల పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ బాల భాస్కరరావు అన్నారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, బక్కునాయుడుపేట ప్రాథమిక పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన


కస్తూరీబా గాంధీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు సూచనలిస్తున్న ఎంఈఓ బాలభాస్కరరావు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామంలో వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బుధవారం పర్యటించి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సహాయకుడు సత్యారావు, ఇతర సిబ్బంది మాట్లాడుతూ.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాలు పడుతున్నందున వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన


అలమండ పోలింగ్‌బూత్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణంరాజు

జామి: మండలంలో ఉన్న పలు పోలింగ్‌బూత్‌లను తహసీల్దార్ ఎస్.కృష్ణంరాజు బుధవారం పరిశీలించారు. మండలంలో గజపతినగరం నియోజకవర్గ పరిధిలోని భీమసింగి, ఎం.కె.వలస.. ఎస్.కోట నియోజకవర్గ పరిధిలో ఉన్న అలమండ పోలింగ్ బూత్‌ను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.